క్లుప్తంగా

పిచ్చి మొక్కలు తొలగించండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 28, 29 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కాల్వలు ప్రతిరోజు బాగు చేయండి

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలను ప్రతి రోజూ బాగు చేయకపోవడం వలన పారుదల నిలిచి పోయి దుర్గంధ భరితంగా మారుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలు పొంగి రోడ్లపైకి రావడాన్ని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. కాల్వలను ప్రతిరోజు బాగు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ పేరిట బాలికకు వేధింపులు

బలవంతంగా తీసుకెళుతుండగా అడ్డుకున్న తండ్రి

తెనాలిరూరల్: ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడు ఆమెను బెదిరించి బలవంతంగా తీసుకెళుతుండగా బాలిక తండ్రి చూసి అడ్డుకున్నాడు. యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటోంది. ఐతానగర్‌కు చెందిన మాతంగి భరత్ కొన్నాళ్లుగా బాలికను అనుసరిస్తున్నాడు. ఆమె ఎటు వెళితే అక్కడకు వెళుతున్నాడు. సోమవారం బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చిన భరత్ ఆమెను బెదిరించి బైక్‌పై బలవంతంగా తీసుకెళుతుండగా అప్పుడే పని నుంచి వచ్చిన బాలిక తండ్రి గమనించి అడ్డుకున్నాడు. భరత్‌పరారవగా, ఈ విషయమై త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'బాలోత్సవ్'లో తెనాలి విద్యార్థులు



తెనాలి: నంబూరులోని వీవీఐటీ కాలేజీలో మూడు రోజులపాటు జరిగిన 'బాలోత్సవ్'లో స్థానిక ఎస్ఏఎస్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థినీ విద్యార్థులు 36 మంది వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఆయా విద్యార్థులను మంగళవారం పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని ప్రసూనాదేవి అభినందించారు. సమన్వయకర్త బెల్లంకొండ వెంకట్ మాట్లాడుతూ తమ విద్యార్థులు నాటికలు, కథారచన, స్పెల్‌బీ, చిత్రలేఖనం, కథ చెబుతా, డిజిటల్ డ్రాయింగ్, పేపర్‌కటింగ్, మట్టితో బొమ్మల తయారీ, పద్యగానం, జానపద గీతాలాపన పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులూ విద్యార్థులను అభినందించారు.

నేడు తూములూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్లిపర: మండల పరిధిలోనే తూములూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభిస్తున్నట్లు తెనాలి ఏడీఏ ఉషారాణి, కొల్లిపర తహసీల్దారు జి.సిద్ధార్థ తెలిపారు. మంగళవారం వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు తూములూరు గ్రామంలో ముందస్తుగా వరి కోతలు రావటంతో రైతులు అధిక సంఖ్యలోఐదు రోజుల నుండి మిషన్లు ద్వారా కోతలు కోస్తున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు తూములూరు ఆర్బీకే కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ప్రారంభించటానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనాసింహా, వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులు పాల్గొని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కావున తూములూరు గ్రామంలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సంప్రదించాలి

తాడికొండ: బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ కె.చినకోటేశ్వరరావు తెలిపారు. తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులు హరించే హెల్ప్‌లైన్ అండగా నిలుస్తుందన్నారు. హెచ్ఎం ఏవీవీ ప్రసాద్, మహిళా సంరక్షణ కార్యదర్శి జయవర్ధని పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ప్రతిభా పోటీల సందడి

తెనాలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో మంగళవారం మహిళలు, విద్యార్థినులకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు, యువతుల ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గ్రంథాలయాధికారిణి కావూరి రమాదేవి మాట్లాడుతూ ఇందిరాగాంధీ జీవిత విశేషాలు, ధైర్యసాహసాలు, ప్రధానమంత్రిగా ఆమె సాధించిన విజయాలను వివరించారు. గత వారంరోజులుగా నిర్వహించిన వివిధ ప్రతిభా పోటీల్లో విజేతలకు బుధవారం జరిగే ముగింపు సభలో బహుమతులను ప్రదానం చేయనున్నట్టు తెలియజేశారు.



తెనాలి గ్రంథాలయంలో కార్యక్రమానికి హాజరైన అతిథులు, విద్యార్థులు

బాలల గ్రంథాలయంలో...

స్థానిక కొత్తపేటలోని మహిళా మండలి భవనంలోని మహిళా బాలల గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం పాఠశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు జరిపారు. పి.ఝాన్సీలక్ష్మి, టి.కుమారి, వి.లక్ష్మి, వి.పద్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

కొలకలూరులో...

రూరల్ మండల గ్రామం కొలకలూరులోని శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ఆరో రోజైన మంగళవారం విద్యార్థినులకు ఫ్యాన్సీ డ్రెస్, డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. విద్యార్థినులు సరస్వతీదేవి, భరతమాత, మదర్ థెరిసా, సావిత్రిబాయి పూలే, ఝాన్సీలక్ష్మీబాయి, సరోజిని నాయుడు, అల్లూరి సీతారామరాజు వేషాల్లో సందడి చేశారు. దీంతోపాటు జానపద నృత్య పోటీలను జరిపారు. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూలు, శ్రీవివర్ధిని స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. స్కూల్ ఉపాధ్యాయులు అన్నారావు, రాణి, ఎస్తర్, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. గ్రథాలయాధికారిణి కడియాల సుజాత పర్యవేక్షించారు.



సంగంజాగర్లమూడిలో ముగ్గుల పోటీ

సంగంజాగర్లమూడిలో...

రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నారు. గ్రంథాలయాధికారి జె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో మంగళవారం సీనియర్స్ , జూనియర్స్ విభాగాల్లో ముగ్గులు పోటీలు నిర్వహించారు. అతిథులుగా జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శివరామకృష్ణ, తెలుగు పండిట్ అనంతశయనం హాజరయ్యారు. న్యాయనిర్ణేతలుగా వ్యాయామ ఉపాధ్యాయిని నాగశ్రీవల్లి, పూర్ణకుమారి, పి. సంధ్యారాణి వ్యవహరించారు.

పెదరావూరులో...

మండల గ్రామం పెదరావూరులోని శాఖాగ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జడ్పీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు పరుగుపందెం, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు జరిపారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు సామ్రాజ్యం, ఎం.మధుమయి, గ్రంథాలయ అధికారి ఎ.రాఘవేంద్రరావు పర్యవేక్షించారు.



బాలల గ్రంథాలయంలో ముగ్గుల పోటీ



కొలకలూరులో ఫ్యాన్సీ డ్రెస్సుల్లో విద్యార్థినులు



పెదరావూరులో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

పథకాల్లో భాగస్వాములు కావాలి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, బ్యాంక్ ఆఫ్ ఇండియా తెనాలి మేనేజర్ దుర్గాప్రసాద్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వానిధి కూడా స్వాభిమానం కూడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో విధి వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా యోజన వంటి పథకాల్లో అందరూ చేరాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మెప్మా సీఎంఎం విజయ, పలువురు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్ దుర్గాప్రసాద్

డాక్టర్ వెంకటేశ్వరరావుకు గోల్డ్ మెడల్

తెనాలిరూరల్: గుంటూరు సమీపంలోని కాటూరి మెడికల్ కళాశాల ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటేశ్వరరావుకు బంగారు పతకం ప్రదానం చేశారు. పట్టణ బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావుకు డాక్టర్ కొత్త పరిణామలక్ష్మి స్మారక ధార్మిక బంగారు పతకాన్ని ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'పాసిటివ్ చైల్డ్‌బర్త్ ఎక్స్‌పీరియన్స్' అన్న అంశంపై డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ఐఎంఏ తెనాలి శాఖ బాధ్యులు డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ మధుప్రభాకర్, డాక్టర్ కె. శ్యామ్ ప్రసాద్, డాక్టర్ చందు ఉదయ్‌భాస్కర్, సీనియర్ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ ఘంటా నరసింహారావు తదితర వైద్యులతో పాటు డాక్టర్ పరిణామలక్ష్మి తనయులు డాక్టర్ రవికిరణ్, డాక్టర్ శశికిరణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



డాక్టర్ వెంకటేశ్వరరావుకు బంగారు పతకాన్ని ప్రదానం చేస్తున్న తెనాలి వైద్యులు

మహిళా మండలి భవన సందర్శన

తెనాలి: గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మంగళవారం సాయంత్రం తెనాలి విచ్చేశారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణతో కలిసి స్థానిక కొత్తపేటలోని మహిళా మండలి భవనాన్ని పరిశీలించారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన మహిళా మండలి భవనాన్ని సంబంధిత పాలకవర్గం ఇటీవల ప్రభుత్వానికి అప్పగించిన విషయం తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆ పత్రాలను అందజేశారు. మహిళా మండలి భవనాన్ని మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధికి వినియోగించాలని ఆ సందర్భంగా మంత్రి ఆదేశించారు. తదుపరి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆ భవనాన్ని మున్సిపాలిటీకి అప్పగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆ భవనాన్ని మహిళా నైపుణ్య కార్యకలాపాలకు వినియోగించుకోవటంపై పరిశీలనకు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సంజీవరావు ఆ భవనాన్ని పరిశీలించారు. చేపట్టాల్సిన కార్యక్రమాలపై కమిషనర్, తహసీల్దారుతో చర్చించారు.



మహిళా మండలి భవనంలో సంజీవరావు, గోపాలకృష్ణ, శేషన్న

రాష్ట్రస్థాయి క్రీడల పోటీల్లో మున్సిపల్ విద్యార్థులు

తెనాలి: గుడివాడలో ఈనెల 16 ,17 తేదీల్లో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ఆరుగురు, 16-18 తేదీల్లో కాకినాడలో జరిగిన అండర్-19 హాకీ పోటీల్లో మరో ముగ్గురు పాల్గొని రాష్ట్ర స్థాయి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి మంగళవారం ఆ విద్యార్థులను అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో వివిధ కేటగిరీల్లో లీలా గాయత్రి ప్రసన్న, సయ్యద్ సమీరా(8వ తరగతి), పెనుమూడి బ్యూలా, జ్యోత్స్న ప్రియ, నవ్య, కొమరగిరి శివయ్య (9వ తరగతి) పాల్గొన్నారు. కాకినాడలో జరిగిన హాకీ పోటీల్లో షేక్ రియాజ్ (8వ తరగతి), షేక్ హనీఫ్, షేక్ సుహాన (9వ తర గతి) పాల్గొన్నారని వ్యాయమ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి , కొడాలి గోవర్ధన తెలియచేశారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, బి.శ్రీనివాస్, చక్రవర్తి, సోమరౌతు శ్రీనివాసరావు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థినీ విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

రేపు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఉపాధి శిక్షణశాఖ గుంటూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, పీజీ, బిటెక్ (మెకానికల్, ఈఈఈ, ఈసీఈ) చదివిన వారు దీనిలో పాల్గొనవచ్చని చెప్పారు. బయోడేటాతో పాటు విద్యార్హత, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నెం.78937 89361, 90144 91772 లో సంప్రదించాలని సూచించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లిపర: ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ ఇసుక తోలే ట్రాక్టర్లకు తప్పనిసరిగా ఆన్లైన్లో నమోదు చేసిన బిల్లు ఇసుక తరలించే ట్రాక్టరుకు జీపీఎస్ అనుసంధానం వాహనం ముందు ఫ్రీ ఇసుక ఫ్లెక్సీ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. వీటిలో ఏది లేకపోయినా సంబంధిత వాహనాన్ని అదుపులో తీసుకొని కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు నాలుగు ట్రాక్టర్ల పై కేసు నమోదు చేసి తహసీల్దార్ కు బదిలీ చేసినట్లు తెలిపారు.

హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉండండి

తెనాలిఅర్బన్: హెచ్ఐవీపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఎం అమ్మాజీ, కమలాకర్‌లు సూచించారు. హ్యాపెన్ టీబీ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాల, మార్తా గ్రూఫ్ ఆఫ్ నర్సింగ్ ఇనిస్ట్యూట్‌లో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలిపారు. ఎయిడ్స్ వ్యక్తులతో శారీరక సంబంధాన్ని కలిగి ఉంటే ఇది వస్తుందని చెప్పారు. సమావేశంలో ఎన్‌సీసీ అధికారిణి శ్రీలక్ష్మి, ఎస్.నాగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

అధిక కట్నం వేధింపులపై కేసు నమోదు

తాడికొండ: అధిక కట్నం కోసం భర్త మానసికంగా, శారీరకంగా వేదిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. రాయపూడి గ్రామానికి చెందిన షేక్ అమర్జాకు విజయవాడకు చెందిన ఇర్ఫాన్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కట్న కానుకల కింద రూ.5 లక్షలు ఇచ్చామని, అధిక కట్నం తీసుకురావాలని భర్త తనను శారీరకంగా, మానసికంగా వేదిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన

మేడికొండూరు: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పేరేచర్ల ఇంటెల్ హై స్కూల్ ప్రిన్సిపల్ కోనూరి అశోకరాణి జయకుమార్ అన్నారు. ఇటీవల గుంటూరు సమీపంలోని వీవీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 16న నిర్వహించిన తెలుగు బాలల పండుగ బాల ఉత్సవ్ కార్యక్రమంలో ఇంటెల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఏకపాత్ర విభాగంలో ఝాన్సీ లక్ష్మీబాయి పాత్రధారి ఎం.వెంకట పూజ కన్సోలేషన్ బహుమతి, నాటికలు విభాగంలో కార్తీక్ కుమార్ అండ్ టీం మొదటి బహుమతి సాధించారు. బహుమతి సాధించిన విద్యార్థులకు ఇంటెల్ హైస్కూల్‌లో సోమవారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కోనూరి అశోకా రాణి జయకుమార్ మాట్లాడుతూ కళలు విద్యార్థుల జీవితాల్లో నూతన ఆలోచనల్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు మంచి వాతావరణంలో ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.సుకన్య, పిల్లలు విజయం సాధించడానికి ముఖ్య కారకులైన ఇంటెల్ స్కూల్ పీడీ ఎస్.కె రన్ను హుస్సేన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఆధార్ సేవలను ఉపయోగించుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఆధార్ కేంద్రాల సేవలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. సుల్తానాబాద్‌లోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ కార్డులను విద్యార్థులు పొందేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్‌లో దొర్లిన తప్పులను వెంటనే సరి చేసి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 22 వరకు కౌంటర్ కొనసాగుతుందన్నారు. అనంతరం సిద్ధార్థ స్కూల్‌లో 26 నుంచి 29 వరకు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

ఇందిరకు ఘన నివాళి

తెనాలిరూరల్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మారిస్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడితో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ ప్రధానిగా ఆమె అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాన్నూరు నాగ సూర్య శశిధరరావు, తెనాలి మండల అధ్యక్షుడు కర్లపూడి బుల్లియ్య, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురప్ప ద్వారకా శ్రీనివాసు, నెమలికంటి ఆదిమ్మ, అయ్యప్ప, స్టీవెన్‌బాబు, మాబు, రాయప్ప, సత్యనారాయణ, కృష్ణ, శ్రీను, పోలేరాం , మల్లికార్జునరావు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. సంబంధిత కరపత్రాన్ని మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు శ్రీస్వామివారికి విశేషపూజ, అనంతరం కూచిపూడి నృత్యప్రదర్శన, అన్నమాచార్యుల సంకీర్తనల ఆలాపన అనంతరం శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. తదుపరి తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్‌కుమార్, సభ్యులు గుడివాడ బాలకృష్ణ, జంధ్యం రామారావు, వుప్పల వరదరాజులు, మూర్తి వెంకటేశ్వరరావు, మదుపల్లి చంద్రశేఖర్, కట్టమూరి రమణకుమార్, మాజేటి వెంకటేష్, రొంపిచర్ల సురేష్, బచ్చు లీలాప్రసాదరావు, రమణకుమార్ పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరించిన నిర్వాహకులు

ఇక సెట్స్‌పైకి 'సెటిల్‌మెంట్' సినిమా

- జర్నలిస్టు జీవితం నేపథ్యంగా భారీ చిత్రం
- చిత్రదర్శకుడు శ్రీనివాసయాదవ్



అచ్చన శ్రీనివాసయాదవ్

తెనాలి: నిబద్ధత గల జర్నలిస్ట్ కథతో వినూత్న అంశాలతో తెరకెక్కనున్న 'సెటిల్‌మెంట్' చిత్రం ప్రీప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకుని డిసెంబర్ నుంచి సెట్స్‌పైకి వెళుతుందని చిత్ర దర్శకుడు అచ్చన శ్రీనివాస యాదవ్ తెలిపారు. తెనాలిలో మంగళవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈవీవీ సత్యనారాయణ 'చిలక్కొట్టుడు'తో అసిస్టెంట్ డైరెక్టర్ గా కెరీర్ ప్రారంభించిన శ్రీనివాసయాదవ్ ఆ తర్వాత 13 సినిమాలకు వివిధ దర్శకుల దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్ గా, కో-డైరెక్టర్ గా పనిచేసి, 'ఫ్రెండ్స్ కాలనీ'తో దర్శకుడిగా మారారు. కొంతకాలంగా టీవీ సీరియల్స్ కు క్రియేటివ్ హెడ్‌గా, కొన్ని పాపులర్ బ్రాండ్లకు యాడ్ ఫిల్మ్ మేకర్‌గా పని చేశారు. తాజాగా 'సెటిల్ మెంట్' పేరుతో పూర్తి, కమర్షియల్ యాక్షన్ బ్యాక్ డ్రాప్‌తో చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. జర్నలిస్ట్ జీవితం నేపథ్యంలో సాగే కథను సిద్ధం చేసుకుని మళ్ళీ మెగా ఫోన్ పట్టి డిసెంబర్‌లో సెట్స్ పైకి వెళుతున్నట్టు తెలిపారు. జర్నలిస్టులపై తనకు గౌరవం వుందనీ, తన కెరీర్ కూడా జర్నలిస్టుగానే మొదలైందని గుర్తుచేశారు. నిజమైన జర్నలిజానికి కట్టుబడిన జర్నలిస్ట్ పెన్ను, ఎంత పవర్ ఫుల్ గా ఉంటుందో ఈ చిత్రంలో చూపించబోతున్నానని చెప్పారు. ముంబయికి చెందిన ఎస్వీఎస్ ఫిలిం ఫ్యాక్టరీ నిర్మించే ఈ సినిమాలో హీరోగా కన్నడంలో వరుసగా మూడు సూపర్ హిట్లు ఇచ్చిన వివేక్ హీరోగా చెప్పారు. పాటల రికార్డింగ్ పూర్తయిందన్నారు. సంగీత దర్శకుడు వెంకట్ అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చాడు. స్క్రీన్ ప్లే, మాటలు శేషభట్టర్ వేంకటరమణ. హైదరాబాద్, బెంగుళూరుల్లో షెడ్యూల్స్ జరుగుతాయని వివరించారు.

తెనాలిలో సహకార వారోత్సవాలు

తెనాలి: స్థానిక కొత్తపేటలోని పోస్టల్ అండ్ టెలికామ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీలో మంగళవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. డివిజనల్ సహకార అధికారి కేవీ రామారావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్ విజయలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సహకార వ్యవస్థ ప్రాముఖ్యతను కేవీ రామారావు వివరించారు. సహకార రంగ పటిష్టతకు అందరూ చిత్తశుద్ధితో కృషిచేయాలని, సహకార సంఘాల సేవలను సభ్యులను ఉపయోగించుకోవాలని సూచించారు. సభ్యులందరితో సహకార ప్రతిజ్ఞ చేయించారు. తొలుత సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు ఎం.రవికుమార్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కోశాధికారి టి.పోతురాజు, డైరెక్టర్లు యూవీ సత్యనారాయణ, వి.వెంకటేశ్వర్లు, సీఈవో డీఎస్ నాగేశ్వరరావు, పోస్టల్, టెలికామ్ సిబ్బంది, సహకార సిబ్బంది పాల్గొన్నారు.



సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రామారావు

భగవాన్ బిర్సాముండా జయంతి

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఆదివాసి స్వాంత్రత్య యోధుడు భగవాన్ బిర్సాముండా 150 జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శౌరీజోజి మాట్లాడుతూ ఝార్ఖండ్ ప్రజలను ఏకం చేయడంలో భగవాన్ బిర్సాముండా ప్రముఖ పాత్ర వహించారన్నారు. ఆదివాసులకు ఎన్నో సేవలందించిన ఘనత బిర్సాముండాకు దక్కుతుందని, ఆయనను వారు భగవత్స్వరూపంగా భావించి పూజిస్తారని చెప్పారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం భగవాన్ బిర్సాముండా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యా కార్యదర్శి వెంకటేష్ నాయక్, హెచ్ఎం డీవీ.కమల్‌మోహన్ పాల్గొన్నారు.